క్లుప్తంగా

అందుబాటులో గడ్డికోత యంత్రాలు

పశువైద్య అధికారి దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: సబ్సిడీపై గడ్డి కోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవిరెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ త్రీహెచ్‌పీ, త్రీబ్లెడ్స్, త్రీ ఫేజ్ మోటర్స్ చాఫ్ కట్టర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. విశ్వకర్మ కంపెనీ యూనిట్ కాస్ట్ రూ.48 వేలు, సబ్సిడీ రూ.10వేలు తగ్గిస్తే రూ. 38వేలకే వస్తుందన్నారు. వర్ష కంపెనీ యూనిట్ కాస్ట్ రూ. 46,500 సబ్సిడీ రూ.10వేలు పోగా రూ. 36,500లకు ఇస్తున్నారన్నారు. పాడి పశువులు కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు మాత్రమే సబ్సిడీపై ఇవ్వనున్నారని వ్యవసాయ అధికారి తెలిపారు. దీని కోసం 15రోజులలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని దేవిరెడ్డి తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి



పోలీసులకు సూచనలు చేస్తున్న ఏసీపీ రంగస్వామి

కొందుర్గు: పోలీసులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి సూచించారు. బుధవారం ఆయన కొందుర్గు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలురకాల రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన పోలీసులతో మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే వారికి ఇక్కడ తగిన న్యాయం జరుగుతుందని వారిలో భరోసా కలిగించేలా వ్యవహరించాలన్నారు. విధిగా ప్రతిఒక్కరూ డ్రెస్‌కోడ్ పాటించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని, దాతల సహకారంతో సీసీ కెమెరాలను అందుబాటులోకి తేవాలని సీఐ లక్ష్మిరెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య కృషిచేయాలని సూచించారు.

23న వైకుంఠ ఏకాదశి

శ్రీలక్ష్మీవేంకటేశ్వర దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

చేవెళ్ల: ఈ నెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్తరద్వార దర్శనాలకు ముస్తాబు చేస్తున్నారు. చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నట్లు ఆలయ పూజారులు శ్రీకాంత్, శ్రీపాద్‌లు, ఈఓ నరేందర్‌లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలనుంచి ఉత్తరద్వారం ద్వారా స్వామి వారి సర్వదర్శనం ఉంటుందని చెప్పారు. ఉదయం 11–30గంటలకు గరుడ సేవ చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మొయినాబాద్‌రూరల్: అయ్యప్పదేవాలయం హోమంలో పాల్గొన్న స్వాములు

నందిగామ: అంతిరెడ్డిగూడలో బుధవారం గ్రామానికి చెందిన గడ్డల యాదగిరి గురుస్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఈ పూజకు గిరిషన్ నాయర్ గురుస్వామి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరిజీవన్, సుదర్శన్ గౌడ్, నీరటి శివకుమార్, లక్ష్మయ్య, తుమ్మల నర్సింహా యాదవ్, నర్సింగ్ యాదవ్, బాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: కనకమామిడి అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దేవాలయంలో చివరి రోజు పడిపూజ నిర్వహించారు. అనంతరం స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి, గురుస్వాములు సుదర్శన్‌రెడ్డి, ఉపసర్పంచ్ మర్రి రాంరెడ్డి, మర్రి నాగమల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: అప్పోజీగూడలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. అయ్యప్ప దాసన్ కేశవ్ గురుస్వామి పడిపూజ నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నదానం చేశారు. గురుస్వాములు శ్రీశైలం, కుమార్, మహేందర్, నర్సింహారెడ్డి, విజయ్‌కుమార్, స్వాములు, వంశీ, శివ, శ్రావణ్‌కుమార్, శ్రీపాల్, రాజేశ్, శ్రీకాంత్‌రెడ్డి, హరి, శరత్, లాస్య, సహస్ర తదితరులు పాల్గొన్నారు.



నందిగామ: పడిపూజలో యాదగిరి గురుస్వామి

తెల్లబంగారానికి మద్దతేది?

సీసీఐ కేంద్రం వద్ద రైతుల అగచాట్లు

- క్యూలైన్లో గంటల తరబడి పడిగాపులు
- తేమశాతం సాకు చూపుతూ కోత విధిస్తున్న మిల్లర్లు
- ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ధరణి కాటన్ మిల్లులో కొనుగోలు చేస్తున్న పత్తి నిల్వలు

చేవెళ్ల: రైతులు పండించిన తెల్లబంగారానికి మార్కెట్‌లో ఆశించిన ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు అంటూ అరకొరగా ఏర్పాటు చేయడంతో రైతులు అగచాట్లు పడుతున్నారు. జిల్లాలో పలు చోట్ల సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్న అధికారులు పలు మండలాల రైతులకు ఇవీ అందుబాటులో లేకపోవడంతో పండించిన పంటను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని చిట్టెంపల్లి సమీపంలోని ధరణి కాటన్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో రైతులకు గోస తప్పడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. అక్కడున్న సీసీఐ అధికారులు, మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి కల్పిస్తూ ప్రైవేటు వ్యాపారులకు రాజమార్గం చూపిస్తూ వారికే కొమ్ముకాస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉదయం వచ్చిన రైతులు అక్కడే ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయంటున్నారు. వ్యాపారులు మాత్రం దర్జాగా అమ్ముకొని పోతున్నారు. ఇలాంటి సంఘటనలు కళ్ల ముందు కనిపిస్తున్నా ఏమి చేయాలేని స్థితిలో వారు ఉండిపోతున్నారు. ఉదయం నుంచి పస్తులతో మిల్లుల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తుందని చెబుతున్నారు. క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కొనుగోలు కేంద్రాలు రైతుల కోసం ఏర్పాటు చేశారా? లేదా వ్యాపారులకోసం ఏర్పాటు చేశారా? అని పలువురు రైతులు మిల్లర్లను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తేమ పేరుతో కోత..

రైతుల కోసం ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటిస్తున్నా అవీ క్షేత్రాస్థాయిలో అమలు కావడం లేదు. రైతులకు ఉపయోగపడటం లేదని పలువరురు రైతులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. పేరుకే మద్దతు ధర రైతులకు అందేది నామమాత్రమే. పత్తికి బయట మార్కెట్‌లో మద్దతు ధరకంటే తక్కువ ధర ఉండడంతో రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు వస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని సీసీఐ అధికారులు, కాటన్‌మిల్లు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పై అధికారులకు మాత్రం అంతా సజావుగానే ఉందని చెబుతున్నారు. పత్తికి ప్రభుత్వ మద్దతూ ధర రూ.7,020గా నిర్ణయించింది. కాని మిల్లుకు వచ్చే రైతుల్లో ఈ ధరలో వందలో 20శాతం మందికే దక్కుతుందని చెబుతున్నారు. మిగత వారికి పత్తిలో తేమశాతం సరిపోవడం లేదనే సాకుతో ధరలో కోత విధిస్తున్నారు. రైతులను మోసం చేస్తున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం మా మండలంలో లేదు



నేను 4 ఎకరాల్లో పత్తి పంట వేశాను. కోత వరకు ఇబ్బంది పడితే ఈ పంటను అమ్ముకునేందుకు అంతకంటే ఎక్కువ ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఉదయం వస్తే రాత్రి వరకు మిల్లు వద్దనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. సీసీఐ కొనుగోలు కేంద్రం మా మండలంలో దగ్గర లేకపోవడంతో చిట్టెంపల్లి ధరణి కాటన్‌మిల్లు అందుబాటులో ఉందని ఇక్కడికి వచ్చాను. కాని ఇక్కడ అంతా మోసం జరుగుతుంది. తేమ శాతం అంటూ మద్దతు ధరలో కోత పెట్టారు. పొలంలో పడించిన పంటనే తీసుకవస్తున్నామని ఇందులో మేము చేసే కల్తీ ఏమి ఉంటుందని మిల్లర్లతో చెప్పిన కూడా ఫలితం ఉండదు. మద్దతు ధర విషయంలో మిల్లర్లదే పైచేయిగా ఉంటుంది.

– రాంచంద్రారెడ్డి, రైతు, ఎల్లకొండ, నవాబుపేట మండలం



వాహనాల్లో ఉంచిన పత్తిలోని తేమను పరిశీలిస్తున్న సీసీఐ సిబ్బంది

మండలాల వారీగా కేంద్రాలు ఏర్పాటు చేయాలి..



రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు మండలాల వారీగా ఏర్పాటు చేయాలి. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం మాకు అందుబటులో లేకపోవడంతో ధరణి కాటన్‌మిల్లుకు వచ్చాం. ఇక్కడ రైతులకోసం సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కాని రైతులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించ లేదు. కనీసం తాగునీరు కూడా లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు క్యూలైన్‌లో వాహనాలతో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంది. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు పంటలను అమ్ముకునేందుకు కష్టాలు తప్పడం లేదు. ఈ పద్ధతి మారాలి. రైతులకు న్యాయం జరగాలి.

– బి. శివకుమార్, రైతు, నవాబుపేట మండలం

వేరే సెంటర్లు ఖాళీగానే ఉన్నాయి...

చిట్టెంపల్లి కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎక్కువగా వస్తున్నారని ఇతర మిల్లులు ఖాళీగానే ఉన్నాయి. ఇక్కడ చేవెళ్ల, నవాబుపేట, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాలతోపాటు, వికారాబాద్ జిల్లాలోని పూడూరు, వికారాబాద్ మండలాలకు చెందిన రైతులకు ఇదే అందుబాటులో ఉండడంతో ఒకేసారి ఎక్కువగా వస్తుండడంతో ఈ పరిస్థితి ఉంది. దీనికి తోడు ఆన్‌లైన్ ప్రాసెస్ తప్పని సరి కావడంతో రైతులకు సమయం పడుతుంది. దీంతో మిల్లుల వద్ద ఆలస్యం అవుతుంది. పూడూర్ మండలంలోనే మరో కాటన్ మిల్లు ఉందని అక్కడ ఎలాంటి ఇబ్బంది లేదని రైతులు అక్కడికి వెళ్లి అమ్ముకోవచ్చు. కాని ఇక్కడ ఒకేసారి ఎక్కువ మంది వస్తే ఇబ్బంది ఎదురవుతుంది.

– సాయికుమార్, సీసీఐ కేంద్రం మార్కెటింగ్ శాఖ ఇన్‌చార్జి

భూ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి



భూ బాధితులతో మాట్లాడుతూన్న పామెన భీంభరత్

కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: చందనవెళ్లి భూ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. బుధవారం చందనవెళ్లి గ్రామంలో ఆయన భూ బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పామెన భీంభరత్ మాట్లాడుతూ రైతులు తమకు అన్యాయం జరుగుతుందని ఆర్డీఓ, ఎమ్మెల్యే, కేటీఆర్‌కు వివరించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. హైతాబాద్ చౌరస్తాలో 40 రోజులపాటు నిరాహార దీక్ష చేస్తే ముడుపులు అందిన బీఆర్‌ఎస్ నాయకులు రాత్రికి రాత్రే దీక్ష శిబిరాన్ని తొలగించి రైతులను భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడోయాత్రలో భాగంగా అప్పటి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతో చందనవెళ్లి భూనిర్వాసితులు తమ 2వేల ఎకరాల భూమిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కుందన్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికాంలోకొచ్చిన వెంటనే తగిన న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చిన విషయాన్ని భీం భరత్ గుర్తు చేశారు. ఈ విషయంలో రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని భీం భరత్ తెలిపారు. వేమారెడ్డి, చేవెళ్ల స్వామి, రాంచంద్రయ్య, సలీం, సత్తయ్య, కిష్టయ్య, నర్సింహులు, మల్లయ్య, శ్రీనివాస్, శోభ, ఇంద్రమ్మ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న చల్లా శేఖర్‌రెడ్డి, సీఈఓ శివకుమార్‌రెడ్డి

షాబాద్: దీర్ఘకాలిక రుణాలను రైతులందరూ సకాలంలో చెల్లించాలని షాబాద్ సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, సీఈఓ శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వారి కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలో తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను రైతులందరూ సకాలంలో చెల్లించాలని సూచించారు. ఓవర్ డ్యూ అయిన దీర్ఘకాలిక రుణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చల్లా శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. క్రాపు లోన్ తీసుకున్న రైతులందరూ వడ్డీతో సహా చెల్లించి, తిరిగి కొత్త రుణాలు తీసుకోవాలని సూచించారు. తమ సంఘం ద్వారా ఇప్పటికే బంగారంపై రుణాలు, ఎల్టీ రుణాలు అందించినట్లు తెలిపారు. మొత్తం 974 మంది రైతులకు రూ.23.28కోట్లు ఎల్టీ రుణాలు, 820 మంది రైతులకు రూ.5.56 కోట్లు క్రాప్ రుణాలు, 442 మందికి రూ.5.18 కోట్లు బంగారంపై రుణాలు, 1996 మంది రైతులకు సంబంధించిన రూ.65.96లక్షల జమ డబ్బులు, 6గురికి సంబంధించిన రూ.31.31 లక్షల ఫిక్స్ డిపాజిట్ డబ్బులు సంఘం ఖాతాలో ఉన్నట్లు తెలిపారు. సహకార సంఘాల్లో రైతులు సభ్యత్వాలు తీసుకోవాలని వారు సూచించారు.

విద్యతో బంగారు భవిష్యత్

ప్రొఫెసర్ ఆయిరాల లోకానంద రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మేనేజ్‌మెంట్ విద్యతో బంగారు భవిష్యత్ ఉంటుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ ఆయిరాల లోకానంద రెడ్డి, హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ జయవంతునాయుడు పేర్కొన్నారు. బుధవారం విద్యాజ్యోతి డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజ్‌లో భాగంగా అధ్యాయ 2కే23 అనే పేరుతో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఫెస్ట్‌కు ప్రముఖ ఎంబీఏ కళాశాలకు చెందిన 600 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకానందరెడ్డి, జయవంతునాయుడు మాట్లాడుతూ విద్యతో పాటు వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నప్పుడే విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీజేఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ సాయిబాబా రెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ పద్మజ, ఎంబీఏ హెచ్‌ఓడీ కన్వీనర్ డాక్టర్ పి చక్రాదర్, ఈవెంట్ కోకన్వీనర్ డాక్టర్ మస్రత్‌జాహా, కోకన్వీనర్ జి రజిత, సృజన, అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న లోకానందరెడ్డి

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

వెల్స్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని వెల్స్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. బుధవారం చిన్న సోలీపేట్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ రమ్య రాంచంద్రారెడ్డి, చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 243 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 37 మందిని ఆపరేషన్ కోసం గుర్తించినట్లు వారు పేర్కొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ రమ్య రాంచంద్రారెడ్డి, డాక్టర్లు

క్షయ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



మాట్లాడుతున్న జయలక్ష్మి

కొందుర్గు: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఇందులో భాగంగానే అన్ని గ్రామాల్లో వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. అందరు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ తీసుకోవాలని సూచించారు. కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. దీనికోసం మహిళా వైద్యులే పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, ఏడీఏ రాజారత్నం, మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాస్, పీహెచ్ఎన్ ప్రభులింగం, లుదియా, ఏపీజీవీబీ బ్యాంక్ సిబ్బంది, బీజేపీ నేతలు అందె బాబయ్య, భూపాలచారి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దినేష్ సార్ సేవలు మరువలేనివి

ఎంపీపీ ప్రియాంక గౌడ్



హెచ్‌ఎం దినేష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు

నందిగామ: నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన దినేష్ సార్ సేవలు మరువలేనివని ఎంపీపీ ప్రియాంక గౌడ్ అన్నారు. నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం బదిలీపై వెళ్లనున్న దినేష్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రియాంక గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు పాఠశాలలో మంచి ఫలితాలను సాధించుటకు హెచ్‌ఎం దినేష్ చేసిన సేవలు అభినందనీయమన్నారు. బదిలీపై హైదరాబాద్‌లోని సాహెబ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్న ఆయన భవిష్యత్‌లో ఎంతో కీర్తి గడిస్తారన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కొత్తూరు మండలంలోని నర్సప్పగూడ, చేగూరు, నందిగామ పాఠశాలలో సమర్థవంతంగా విధులు నిర్వహించాడని, అయన చేసిన సేవలను ప్రస్తుత ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రాములు, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు జానక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

పాలమూరు ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూరు: రానున్న రోజుల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని లోక్యతండాలో ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్‌ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా నిరుద్యోగ యువతకు ట్రస్ట్ తరఫున ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించామన్నారు. రోడ్డు ప్రమాదాలపై యువతకు అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవినాయక్, శంకర్, మహేందర్ రెడ్డి, దేశ్య, శ్రీకాంత్, జగన్, కిషన్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న చందిప్ప గ్రామస్తులు

- ఆక్రమణకు గురవుతున్న భూమివద్దే నిరసన
- పట్టించుకోని అధికారులు

శంకర్‌పల్లి: ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని అధికారులు కాపాడాలని చందిప్ప గ్రామస్తులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఇనాం భూమిగా మార్చుకొని ధరణిలో పేర్లు నమోదు చేసుకొని కొందరు ఇక్కడి భూమిని ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. దీనిని కాపాడాలని గ్రామస్తులు పలు మార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు. చందిప్ప గ్రామంలోని 124సర్వే నెంబర్‌లోని సుమారు 7నుంచి 30 ఎకరాల భూమి 1953నుంచి 2016 వరకు ప్రభుత్వ భూమిగానే రెవెన్యూ రికార్డులో ఉందని వారు తెలిపారు. 2017 నుంచి ఇది ఇనాం భూమి అని వ్రాసి ధరణిలో అదే సంవత్సరం పట్టా భూమిగా మార్పిడి చేయించుకొని పట్టాపాస్‌పుస్తకాలు పొందారని తెలిపారు. కోట్లు విలువ చేసే ఈ భూమిని కాజేసేందుకు కొందరు ఇలా కుట్ర చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే డౌన్‌డౌన్, తహసీల్దార్ డౌన్‌డౌన్ అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆక్రమణ దారులకే వత్తాసు పలుకుతున్నారని వారు ఆరోపించారు. ఇటీవల ప్రజావాణిలో మంత్రి కొండా సురేఖకు, జిల్లాకలెక్టర్‌కు ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

శంకర్‌పల్లి: మహారాజ్‌పేట్ ప్రాథమికపాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఒక్కరోజు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ తాహేర్ అలీ మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, క్రిష్ణ, రియాజ్, జ్యోతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సులోచన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

బొబ్బిలిగామ సర్పంచ్ దండు అర్చన సుధాకర్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని బొబ్బిలిగామ సర్పంచ్ దండు అర్చన సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ హనుమాన్ దేవాలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపన పూజ, యజ్ఞహోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం ఏర్పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యాదవరెడ్డి, పాండు, తదితరులు పాల్గొన్నారు.



నవగ్రహ పూజలో సర్పంచ్ దండు అర్చన, సుధాకర్‌రెడ్డి దంపతులు